యండి. నబ్బూ, తువ్వాలు అక్కడే వున్నాయి." ముసి ముసి నవ్వుతో అంది జానకి.

కలా, మాయా, అనుకున్నాడు శంకరం. కొద్ది రోజుల క్రిందటి జానకి విసుగు, కోపం అర్థం అవలేదు! ఈ నాటి ఆమె ఆదరణా, అభిమానం కూడా అర్థం అవడంలేదు శంకరానికి!

# తాగితే వట్టు!

రాత్రి పదిన్నరకి స్కూటర్ చప్పుడు విని సంబరంగా తలుపు తీసిన వారం రోజుల కొత్త పెళ్ళికూతురు సరళ తూలుతూ వస్తున్న రామ్మూర్తిని చూసి "ఏమిటి తాగారా" అంది అత్యాశ్చర్యకరమైన విషయం చూస్తున్నట్టు. విలాసంగా ఓ నవ్వు నవ్వి భార్య బుగ్గమీద చిటిక వేసాడు రామ్మూర్తి.

"పార్టీ కెళ్ళి తాగకుండా వచ్చే పిచ్చివెధవెవ్వడే చిన్నారీ...." లోపలికి సరళ భుజంమీద చెయ్యివేసి నడిచాడు.

"మీరు తాగుతారని నాకెప్పుడూ చెప్పలేదేం" గుమ్మంలోనే నిలేసింది.

"ఆహాహా....బలే ప్రశ్న వేసావ్ శ్రీమతీ. నే తాగుతా, సిగరెట్టు కాలుస్తా, స్నానం చేస్తా, భోజనంచేస్తా సుమా అని పెళ్ళిచూపులపుడే చెప్పాలంటావా...."

"అబ్బ అదికాదు....ముందు వదలండి నన్ను....ఛీ... కంపూ మీరూనూ. నన్ను ముట్టుకోకండి - తాగడం, భోజనం చేయడం ఒకటే అన్నట్టు మాట్లాడుతున్నారే-" కోపంగా అంది.

"నా రాణీ....యీ రోజుల్లో తాగని మగాడెవడో నాకు చూపించు...." అతని మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి.... "అలా చూపించు....అప్పుడు చెప్పుచ్చుకు కొడ్తువుగాని...." భార్యని మోటుగా-దగ్గిరికి లాక్కున్నాడు. "డార్లింగ్.... నీవెంత బాగున్నావో తెలుసా....తెల్ల చీర, మల్లెపూలు, ఓహో....అప్సరన దిగొచ్చిందా నా కోసం...."

"ఛీ వదలండి. ఫ్రెండు వెళ్ళిపోతున్నాడు డిన్నరు పార్టీ అంటే సరే అను కున్నాను గాని ఇలా తాగి వస్తారనుకోలేదు....నా దగ్గిరకి రాకండి....మీ కోసం అని, మీ కిష్టమని ... యీ చీర....యీ పూట" సరళ గొంతు జీరపోయింది. కళ్ళల్లో నీటిపొర.

"ఓ సారీ, డియర్....నీకంట నీలాలు నే చూడలేను - తాగితే ఏమయింది. కమాన్....రా....నీకు స్వర్గం చూపిస్తాను యివాళ....ఎంత మజాగా వుంటుందో తెలుసా...." అంటూ బలవంతంగా లాక్కుని ముద్దులతో ముంచెత్తసాగాడు. ఎప్పుడూ చూడని అతని ఆవేశం, ఆరాటం కొత్తగా అన్పించి ఉక్కిరిబిక్కిరి అయి పోయింది సరళ. అతనేకాదు ఆమె కూడ అతనితోపాటు ఆదేరకం మత్తులో జారి పోయి అతన్ని వారించలేక అతని చేతిలో నలిగిపోయింది.

సరళ అందరి ఆడపిల్లాగే ఎన్నో ఆశలతో, కోరికలతో కొత్త కాపురంలోకి అడుగుపెట్టింది. మధ్యతరగతి సంసారంలోపుట్టి మధ్యతరగతి ఆశలమధ్య పెరి గింది. బి. ఏ. వరకు చదువుకుని బ్యాంకు క్లర్కుగా పని చేస్తున్న రామ్మూర్తి యిల్లాలయి రాజధాని నగరంలో కాపురానికి వచ్చింది వారం క్రితం. గుమాస్తా ఉద్యోగం అయినా బ్యాంకుల్లో జీతాలు బాగుంటాయని కూతురు జీవితానికి సుఖ సోపానాలు వేశానని తండ్రి తృప్తిపడి చేతనయినంతలో పెళ్ళిచేసి, వున్నంతలో సారె చీర యిచ్చి కాపురానికి పంపాడు. టూ బెడ్‌రూమ్సు, డ్రాయింగు రూము, వంటగది....చిన్న ఫ్లాట్ .... తెచ్చుకున్న, కొనుక్కున్న సామాను, అభిరుచి కలిపి అలంకరించి తన యింటిని చూసుకుని మురిసిపోయింది సరళ - భర్త ఆరడుగుల అందగాడు నవమోహనకారుడు కాకపోయినా స్మార్ట్‌గా వున్నాడని, సరస సంభా షణా చాతుర్యం వున్నవాడని అర్థం చేసుకుని సంతృప్తిపడింది....

నిజంగా రామ్మూర్తి సరస సంభాషణ మాత్రమే తెల్సినవాడు కాదు. సరసం, తెల్సినవాడే-జీవితం అంటే అనుభవించి, ఆనందించాల్సినదని నమ్మేరకం - అన్ని రుచులు, అనుభవాలు చవిచూడాలనే మనస్తత్వం వున్నవాడు-

శనివారం, శనివారం పార్టీలు, పార్టీలలో తాగడాలు సిగరెట్లు-అప్పుడప్పుడు పేకాటలు అన్నీ బ్యాచిలర్ లైఫ్‌లో అలవాటయిన అలవాట్లు అవి వ్యసనాలని అతని కనిపించలేదు ఎప్పుడూ-ఇప్పుడూ అవి అభ్యంతరకరమైన విషయాలుగా అతనికి అన్పించలేదు కాని తన భార్యకి అనిపించవచ్చు అన్నది పెళ్ళయిన యిరవై రోజు లలో అతనికి తట్టలేదు....సిగరెట్టు కాలిస్తే అభ్యంతరం చెప్పని భార్య తాగుడికి అభ్యంతరం చెప్పదనుకున్నాడు. అయితే యీ యిరవై రోజులలో కొత్త పెళ్ళాం మోజులో తాగుడుమీదకి దృష్టిపోలేదు.

సరళ కాపురానికి వచ్చాక కొత్తమోజు కొంత తీరాక కొంత నాలిక దురద మొదలుపెట్టింది. దానికి తోడు ఫ్రెండ్సు పెళ్ళి చేసుకు వచ్చావు పార్టీ ఏదిరా అంటూ ప్రాణాలు తీసేసరికి అరడజనుమంది ఫ్రెండ్సు కల్సి జల్సా చేసుకున్నారు. మందు ఇచ్చిన మత్తు గమ్మత్తుగావుండి, మందులో మగువ మరింత మజాగా అని పించింది రామ్మూర్తికి మొదటిసారి ఆ రుచి తెల్సి!

* * *

తెల్లారి ఆదివారం. సావకాశంగా ఎనిమిదింటికి లేచి. తొమ్మిదింటికి వంటింట్లో కూర్చుని వేడివేడిగా సరళ దోసెలు వేస్తూంటే ఒక్కొక్కటి లాగి స్తున్నాడు రామ్మూర్తి.

"ఇదిగో యివాళే చెప్తున్నాను-మీరు మళ్ళీ యీసారి ఎప్పుడూ తాగి వచ్చా రంటే వూరుకోను" చేతిలో అట్లకాడతో బెదిరిస్తూ అంది సరళ.

"ఏదో రెండు మూడు రోజులకి ఒసారి తాగితే తప్పేమిటోయ్. ఏదో యింట్లో బుడ్డి పెట్టుకుని రోజంతా తాగుతూన్నట్టు రాద్ధాంతం చేస్తున్నావు ఈ మాత్రం దానికి-"

"ఆ....యిలా పార్టీలు అంటూ ఆరంభించి, వారానికోసారల్లా రోజుకో సారయ్యే వాళ్ళని గురించి చాలా విన్నాను. ఎందుకొచ్చిన పాడు అలవాటు డబ్బు, వళ్ళు గుల్ల చేసుకోడానికి....సిగరెట్టు ఏలాగా వుంది."

"కాఫీ తాగితే ఆరోగ్యానికి చెడ్డ అని, డబ్బు ఖర్చు అని మానేస్తున్నామా.... యిదీ ఓ చిన్న అలవాటు అంతేగా...." సమర్థించుకుంటూ అన్నాడు.

"మహా బాగుంది. కాఫీ, తాగుడు ఒకటే అంటే యింకేం చెప్పాలి మీకు.... సరే తాగండి-కాని తాగి మాత్రం నా దగ్గిరికి వచ్చారంటే వూరుకునేది లేదు—" విస విస వంటింట్లోంచి వెళ్ళిపోయింది సరళ కోపంగా.

తరువాత అరగంట బతిమిలాడి ప్రసన్నురాలిని చేసుకున్నాడు రామ్మూర్తి.

"అబ్బ సరే బాబూ, తాగనన్నానుగా...." అంటూ బుజ్జగించాడు.

"మీ మంచికోసమే కదండి చెప్పేది....ఆరోగ్యం సరే, వెంటనే అంత పాడయిపోదు—కాని డబ్బు చూడండి ఎలా తగలడ్తుందో- వచ్చే జీతంలో సిగరెట్లు, డ్రింక్సులాంటి వాటికి తగలేస్తే మనలాంటి వాళ్ళం ఏం సేవ్ చెయ్యగలం - ఏం కొనుక్కోగలం సామానులు అవి. అందుకే మీకంతగా చెప్తున్నాను" భర్త వడిలో వాలి ప్రేమగా అతని ముంగురులు సవరిస్తూ మురిపంగా అంది.

అతని వాగ్దానాలు నీటిమీద మాటలవుతాయని అనుకోని సరళ రామ్మూర్తి వారానికో సారి తాగివచ్చినప్పుడల్లా అరిచేది, అలిగేది, సాధించేది....

రామ్మూర్తి తాగి వచ్చినప్పుడంతా భార్యని పిచ్చిప్రేమతో ముంచెత్తేవాడు. లాలించేవాడు-బుజ్జగించేవాడు. యింకా సరళ కోపం వదలకపోతే ఏడ్చేవాడు. యిదే ఆఖరుసారి నీమీద వట్టు అని నమ్మించేవాడు. కాళ్ళు పట్టుకునేవాడు మాయమాటలు చెప్పి వశపరుచుకునేవాడు-సరళ అతని మాటలకి లొంగకుండా వుండలేకపోయేది. అతను—కురిపించే ప్రేమవాహినిలో కొట్టుకుపోయేది. ముంచెత్తే ఆ ఆవేశంలో కరిగి పోయేది. భర్త తాగనపుడు కంటె తాగినపుడు చూపించే ప్రేమ, అనురాగం బాగానే వున్నా భర్త యిలాంటి అలవాట్లకి బానిస అయిపోతున్నాడే అన్న బాధ ఆమెని వదిలేదికాదు. ఏం చేసి ఏం చెప్పినా రెండు మూడు రోజుల కోసారి తాగడం అతని చేత మాన్పించలేకపోయింది-

* * *

ఏడాది తరువాత - కొత్త పెళ్ళాం మోజు పాతపడ్డాక - "వెధవ గోలా నీవూనూ....ఏదో కొంపమునిగినట్లు ఏడుపు అన్నింటికి-ఛా....ఫ్రెండ్సుతో కాస్త సరదాగా పార్టీ చేసుకుంటే వెధవగోల .... దరిద్రపు గోల .... అందరి పెళ్ళాలు యిలాగే వున్నారా-ఎప్పుడూ ఏడుపే....కట్టుకున్న వెధవకి ఏదో సరదాలుంటాయని గ్రహించని పెళ్ళాం ఎందుకు-"

"అవును....కట్టుకున్నవాడు కనకే యీ ఏడుపు....తాగిరండి నాథా అని పంపించి తాగించేటంతటి పతివ్రతను కాదు....సంతోషంగా పంపించాలట పైగా చెప్పడం కూడానూ...."

"నీ ఏపుడు ఎప్పుడూ వుండేదేలే....నాకు నిద్ర వస్తూంది ఫో నన్ను విసి గించకుండా-"

"తాగడం వళ్ళు తెలియకుండా పడి నిద్రపోవడం అంతేగా మీకు తెల్సింది. యిప్పుడీ పెళ్ళాం పాతపడిపోయింది. యిదివరకు తాగొచ్చినప్పుడైనా ప్రేమ కురి పించేవారు- యిప్పుడదీ లేదు....ఏదో చదువు. సంస్కారం వున్నవాళ్ళు అను కున్నానుగాని యిలాంటివారనుకోలేదు-" సరళ కంఠం రుద్ధమయింది. అవేం వినే స్థితిలో లేడు రామ్మూర్తి-గురక వినిపించింది.

* * *

మరో మూడేళ్ళ తరువాత-సరళ యిద్దరు పిల్లల తల్లయింది. రామ్మూర్తి యింట్లో మందు సీసాలు పెట్టుకుని రోజూ తాగే స్థితికి చేరాడు. సరళ మొదటి

పురుటికి పుట్టింటికివెళ్ళి ఆరునెలలకొచ్చేనరికి సీసాలు యింట్లోనే ప్రత్యక్షమయ్యాయి. నరళ గోల. ఏడుపులు లెక్కచేసే స్థితి దాటిపోయాడు రామ్మూర్తి-యిద్దరూ అరుచు కోడం, రామ్మూర్తి మరీ తిక్కలో వున్నప్పుడు చెయ్యిచేసుకొనే స్థితిదాకా వచ్చింది పరిస్థితి. ఇద్దరు పిల్లలతో యింటి ఖర్చులు పెరిగాయి — జీతంలో ఒకవంతు పైగా తాగుడు, సిగరెట్లకి పోతూంటే, యింటి ఖర్చులు సర్దలేక తల ప్రాణం తోకకి వచ్చేది నరళకి.

"ఈ నంసారం యీదడం నావల్ల కాదు మీరిలా పెరుగుతున్న ఖర్చులు పట్టించుకోకుండా మీ జల్సాలు మీరు చేసుకుంటుంటే యిల్లు గడపడం నావల్ల కాదు... ఇదిగో మీ జీతం మీ దగ్గిర వుంచుకోండి యింటద్దె, పాలు, కూరలు సామాన్లు మీరే అన్నింటికీ ఖర్చు పెట్టండి - సామానుతెచ్చి పడేస్తే వండుతాను. లేదంటే పస్తు లుందాం-" నరళ డబ్బులు రామ్మూర్తిదగ్గిర పడేసింపో రోజు.

ఇదో కొత్తరకం సాధింపు మొదలుపెట్టావన్నమాట. ఇన్నాళ్ళు నరిపోయింది యిప్పుడెందుకు నరిపోదు....నిలేశాడు.

"ఇన్నాళ్ళు నరిపోయింది- యిప్పుడు ధరయి పెరిగాయి - పిల్లల స్కూళ్ళ జీతాలు, డ్రస్సులు, పుస్తకాలు యివన్నీ మొదలయాయి. రేపటినుంచి ఒకసారే కాఫీ, మనకి టిఫిను లేదు-ఆదివారం మాత్రం వుంటుంది - మనిద్దరికి పెరుగులేదు. నీళ్ళ మజ్జిగ మాత్రం వుంటుంది-మనం కన్న పాపానికి పిల్లలు యిబ్బంది పడ కూడదు. కనక వాళ్ళకివ్వాల్సిన పాలు, పెరుగు అవి కట్ చెయ్యను....లోటు భర్తీ చెయ్యడానికి మనం తగ్గించుకోవాల్సినవి తగ్గించాను-" నరళ ఖరాఖండిగా జవా బిచ్చింది.

"అంటే నీవెంత కావాలంటే అంత తెచ్చివ్వాలా."

"నేనేం మిమ్మల్ని వేలు తెచ్చిమ్మనీ అడగలేదు, లంచాలుతెచ్చి నన్ను అందలం ఎక్కించమనీ అడగడంలేదు. మొగుడి జీతంతో నరిపెట్టుకోవాలన్న ఇంగితం లేనిదాన్ని కాదు....తాహతునిమించి పైకెగిరి బోల్తా పడాలని అనుకోడం లేదు."

"నీ ఏడుపు అంతా నే తాగుతున్నానని....దాని కోనం కట్టుకున్న మొగుడికి కాఫీ లేదు అనే ఆడదాన్ని నిన్నే చూశాను. నంపాదిస్తున్నాను ఆ మాత్రం నరదాలు తీర్చుకునే హక్కునాకులేదనుకుంటున్నావా....పూరుకుంటున్నకొద్దీ మరీ ఎక్కువవు తూంది నీ జులుం-" అరిచాడు.

నరదాలంటే భార్యాబిడ్డలని వెంటపెట్టుకుని ఏ పిక్నిక్కో వెళ్ళడం, ఆది వారం పూట పార్కుకి వెళ్ళగడపడం, నెలకో సారి హోటలు కెళ్ళి తినడం, పిల్ల

లని మంచిగా పెంచుతూ వారు ఆరోగ్యంగా ఆనందంగా పెరగడంలో సరదాలు తీర్చుకోవాలి గాని-పెళ్ళాడిన తరువాత కట్టుకున్న వాళ్ళని. కన్నవాళ్ళని వాళ్ళ ఖర్మానికి వదిలి తమ సరదాలు తీర్చుకోడం అన్యాయం- అది స్వార్ధం-అలాంటి సరదాలు తీర్చుకోవాలంటే పెళ్ళి చేసుకోకూడదు అసలు-" సరళ చాలా ఆవేశంగా కడిగి వదిలింది.

"అవును. అడంగి వెధవలా నీ కొంగుపట్టుకుని యిరవైనాలుగు గంటలూ తిరిగితే అదో సరదా అన్నమాట—" వ్యంగ్యంగా ఎత్తి పొడిచాడు.

కట్టుకున్న భార్యతో సరసం మీ మగాళ్ళకి చాతనయితే సగం సంసారాలిలా ఎందుకు ఏడుస్తాయి లెండి.... పెళ్ళాంతో రోమాన్సు ఏమిటనుకునే వాళ్ళుండబట్టే యీ పెళ్ళిళ్లు యిలా ఏడుస్తున్నాయి. సరే సరదాలు, రోమాన్సులు లేకపోయినా పెళ్ళాం పిల్లలకి కాకుండా డబ్బు తగలేసే అధికారం మీకు లేదు. మీ సిగరెట్లకి, తాగుడికి అయ్యే ఐదారొందలయితే మా అవసరాలు, సరదాలు ఎన్నో తీర్చుకోవచ్చు....యింటికి కావల్సిన వెన్నో అమర్చుకోవచ్చు."

"అంటే మొగవెధవలెంత సేపూ రోజంతా కష్టపడి సంపాదించి భార్యాబిడ్డలకి అన్ని సుఖాలు అందించి త్యాగం చెయ్యాలన్నమాట.... "వ్యంగ్యంగాఅన్నాడు.

"భర్తే కాదు భార్యా భర్త కోసం, యింటికోసం చేసే త్యాగం ఎంతో మీకు తెలియదు కాబోలు-ఒకరి కోసం సర్దుకోడం ఒకరికోసం ఒకరు త్యాగం చేసుకోడం....యిద్దరూ కల్సి పిల్లల కోసం సరదాలు, సుఖాలు త్యాగం చెయ్యడమే సంసారం అంటే...." తనూ వ్యంగ్యంగానే అంది సరళ. "ఇన్ని మాటలు అనవసరం. పెళ్ళయిన ఈ ఆరేదేళ్ళలో ధరలు రెట్టింపులయ్యాయి. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. స్కూళ్ళు, చదువులు, ఖర్చులు పెరిగాయి. యిదివరకులా మీ తాగుడికి అంత డబ్బు తగలేస్తే యింక యీ సంసారం యీదడం నావల్ల కాదు. యిదే ఆఖరుసారి మీకు చెప్పడం-మీరింకాయిలాగే వుంటానంటే నేనే సుయ్యో గొయ్యో చూసుకుంటాను. చెప్పి చెప్పి నా ప్రాణం విసిగి పోయింది" సరళ విరక్తిగా అరిచింది.

"అదేదో తొందరగా చెయ్యి నే బతికిపోతాను—వెధవ బెదిరింపులు.... వెధవ కొంప ... బయటికిపోయి హాయిగా తాగుతాను .. ఏం చేస్తావో చేసుకో....నీ దిక్కున్నచోట చెప్పుకో...." కోపంగావెళ్ళిపోయాడు బయటికి. ఆ మిట్టమధ్యాహ్నం వేళ ఎండలో ....

* * *

ఎండలోపడి ఊరంతా యీ ఫ్రెండింటికి ఆ ఫ్రెండింటికి తిరిగి—సాయంత్రం కాంగానే రెండు పెగ్గులు బిగించి ఏడున్నరకి యిల్లు చేరాడు రామ్మూర్తి. వచ్చే

సరికి యిల్లు తాళంపెట్టి వుంది. పక్కింటి వరండాలో ఆడుకుంటున్న పిల్లలు "డాడీ వచ్చారు....డాడీ వచ్చారు" అంటూ పరిగెత్తి వచ్చారు....పిల్లల కేకలు విని పక్కింటి కమల యింట్లోంచి తాళాలు తీసుకొచ్చి రామ్మూర్తి చేతికిచ్చి "ఆవిడ అర్జంటుగా ఊరికి వెళ్ళాల్సి వచ్చిందటండీ-యింట్లో ఉత్తరం టేబిల్‌మీద పెట్టానన్నారు. తాళాలు నాకిచ్చి వెళ్ళారు-ఈ పూటకి వంట చేసే వెళ్ళారుట" పాఠం అప్పచెప్పినట్లు చెప్పి పిల్లలని అప్పగించి పని అయిపోయినట్టు లోపలికి వెళ్ళిపోయింది.

ఒక్కసారిగా రామ్మూర్తి మత్తు దిగిపోయింది. యింత హఠాత్తుగా ఊరెందుకు వెళ్ళింది చెప్మా....పిల్లల్ని కూడా వదిలి వెళ్ళిందంటే....తాళం తీస్తుంటే అతని చేతులు వణికాయి. గబగబ లోపలికి వెళ్ళి టేబిల్‌మీద ఉత్తరం చేతిలోకి తీసుకున్నాడు.

"నేను మా యింటికి వెళ్ళిపోతున్నాను. పెళ్ళి చేసుకునే ముందు ఎన్నో కలలు కన్నాను—ఎన్నో ఆశలతో కాపురానికి వచ్చాను. నా భర్త ఆదర్శభర్తలా మెలగాలని, యిద్దరిమాట, చేత ఒకటయి సంసారం లాగాలని కోరుకునేదాన్ని వంటరిగా యీ భారం లాగలేననిపించి వెళ్ళిపోతున్నాను. మీ జల్సాలు, సరదాలకి అడ్డురాకుండా, మీరు దయతోవిదిల్చినడబ్బులతోచాలీచాలనిబతుకుబతుకుతూ పతివ్రత నని అనిపించుకోడానికి నేనీతరం అమ్మాయిని.... మీకెదురు చెప్పకుండా, మీరేం చేసినా నోరు మూసుకుపడి వుండలేని ఆత్మాభిమానం కల యీనాటి ఆడదాన్ని నేను. ఏడేళ్ళుగా మిమ్మల్ని మార్చాలని, మారతారని, సంసార బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారని ఓపిగ్గా ఎదురు చూశాను.

మిమ్మల్ని మార్చలేక ఓడిపోయి వెళ్లి పోతున్నాను. ఏ నుయ్యో గొయ్యో చూసుకోడం పిరికి వాళ్ళ లక్షణం.

నా మిగిలిన బతుకు ఎవరిమీద ఆధారపడకుండా నా కాళ్ళమీద నిలబడే ప్రయత్నం యీ రోజునించే మొదలుపెడుతున్నాను. పిల్లల హక్కు మీది! ఆ హక్కు నాకు కావాలని పోరాడి, వాళ్ళని పెంచి పెద్దచేసే స్తోమత ప్రస్తుతం నాకు లేదు! అందుకు వాళ్ళని మీకు వదులుతున్నాను. కన్నతల్లికి పిల్లలని వదిలివెళ్ళడం ఎంతటి బాధో మీకు తెలిస్తే ఏడాదికో రెండేళ్ళకో నన్ను నేను పోషించుకుని పిల్లలని పెంచుకోగలిగిన స్థాయికి ఎదిగిన నాడు వాళ్ళని నా కప్పగిస్తారని ఆశిస్తూ వాళ్ళని వదిలి వెళ్ళిపోతున్నాను. —సరళ.

ఉత్తరం చదివిన అతని మొహం పాలిపోయింది.

ఎంతపని చేసింది సరళ....తనకి బుద్ధి చెప్పటానికి చేసిందా-బెదిరించాలని ఎత్తా....దారికి తీసుకురావాలని ఆడిన నాటకమా....ఒక్క క్షణం కోపం ముంచె

త్తింది. అందరిముందు తనని అవమానపరిచి బుద్ధి చెప్పటానికే యిలా చేసింది అనుకోంగానే కోపంతో వణికిపోయాడు.

"నాన్నా ఆకలేస్తుంది....అన్నం పెట్టు నాన్నా....అమ్మెప్పుడు వస్తుంది నాన్నా...." నాలుగేళ్ళ కొడుకు పట్టి కుదుపుతూంటే తేరుతున్నాడు రామ్మూర్తి - వెళ్ళిన గంటకే యిలా అడిగే పిల్లలని ఎలా సముదాయించగలడు. రేపొద్దున ఆఫీసుకి ఎలా వెళ్ళడం....పిల్లలు స్కూలునించి వస్తే ఎవరు చూస్తారు....వాళ్ళకి నీళ్ళు, అన్నం, చదువు....యింట్లో పని....గుండెలదిరాయి. తలుచుకుంటే....నెమ్మదిగా మనసు కూడదీసుకుని బట్టలు మార్చుకుని వండి పెట్టిన అన్నం పిల్లలకి పెట్టి గిన్నెలన్నీ వంటింట్లో పడేసి పిల్లల పక్కన వచ్చి పడుకున్న రామ్మూర్తికి అనుకోకుండా కళ్ళనీళ్ళ తిరిగాయి.

* * *

"సరళ...యీ శిక్ష చాలు నాకు పద యింటికి వెళదాం...." చిన్నపిల్లాడిలా భార్య గుండెల్లో మొహం దాచుకుని వణికే గొంతుతో అన్నాడు రామ్మూర్తి రాత్రి అత్తవారింటి గదిలో-

పిల్లలని చూడలేక నాలుగైదు రోజులలో భర్త వస్తాడని అనుకుంది....కాని తను వచ్చిన మూడో రోజే పిల్లలని వెంటపెట్టుకుని వచ్చి...రాత్రి గదిలో అలా అనేసరికి కరిగిపోయింది. కాని అది కనపడకుండా బింకంగా" యింట్లో వంటకి పిల్లలని చూసుకోడానికి మనిషి కావాలి మీకు యిబ్బందిలేకుండా - మీక్కావలసింది భార్య కాదు, యిలా అని మళ్ళీ నాల్గురోజులలో మళ్ళీ మామూలు అయిపోతారు. మనసు దిటవుపరుచుకొని వచ్చాను. మళ్ళీ నన్ను రమ్మని నా నిర్ణయాన్ని సడలించకండి- నా బతుకు నన్ను బతకనీయండి - పిల్లలని కావలిస్తే వదిలి వెళ్ళండి- వాళ్ళ పోషణకి డబ్బు పంపండి."

"సరళా....ప్లీజ్ అలా మాట్లాడకు....నీవు లేని క్షణంలోనే నీ విలువ అర్థం అయింది. నీ మీద వట్టు....పిల్లలమీద వట్టు యింక తాగను ...సిగరెట్లు కూడా తగ్గిస్తాను....ప్రామిస్....నన్ను నమ్ము...." దీనంగా అన్నాడు.

"ఒక షరతుమీద వస్తాను. మీరే రోజయినా ఆడిన మాట తప్పినరోజు ఆ రోజే యిల్లు వదులుతాను శాశ్వతంగా. మొదటిసారని....మీరు నిజంగా ఫీలవుతున్నారని నమ్మి వస్తున్నాను .... ఆ మాట గుర్తుంచుకోండి...." సరళ చేయిలో చెయ్యివేసి ఆమె గుండెల్లో మొహం దాచుకున్నాడు రామ్మూర్తి.

* * *

"ఏమిటిది!" ఆశ్చర్యంగా చూశాడు క్వార్టర్ బాటిల్ రమ్ - గ్లాసు టేబిల్ మీద పెట్టిన సరళని ఆశ్చర్యంగా చూశాడు రామ్మూర్తి.

"తాగండి....దీని కోసమేగదా నెల రోజులనించి ఏదో పోగొట్టుకున్న వాడిలా, పెళ్ళాం పిల్లలు పోయినవారిలా, మాట మంతి, ఉలుకు పలుకు లేకుండా అలా కూర్చుంటున్నారు. నాకు కావాల్సింది మీరు మామూలు మనిషిలా సరదాగా హాయిగా సుఖంగా వుండగలగడం కాని, రాజ్యాలుపోయిన వాడిలా యిలా కూర్చోడం కాదు- మీకు కావల్సింది ఆ తాగుడే కాని మేం వద్దు....తీసుకోండి. బలవంతంగా ఏది ఎవరిచేత చేయించలేం అని అర్థం అయింది నాకు." నిష్ఠూరంగా అంది సరళ.

"ప్లీజ్ సరళా నన్నర్థం చేసికో....యీ అలవాటు మానడం అంత సులువనుకుంటాను. నేనెంత ప్రయత్నించుతున్నానో నీ కర్థంకాదు...." దీనంగా అన్నాడు.

"నా కర్థం అయింది....అంతలా అలవాటయిన మీరు మానలేరని అర్థం అయింది. తాగండి. తాగి కాస్త నవ్వండి....కాస్త మనిషిలా మాట్లాడండి....ఒక్క విన్నపం....రోజూ కాకుండా వారానికోసారి కాగండి....యీ మాత్రం మారితే చాలు....సరిపెట్టుకుంటాను."

రామ్మూర్తి స్థిర నిర్ణయం తీసుకున్నవాడిలా బాటిల్‌వంక చూసి అది తీసికెళ్ళి సింక్‌లో పారపోశాడు. "వద్దు సరళా నన్ను ప్రలోభంలో పెట్టకు-వారానికోసారి అంటే అంతటితో ఆగలేనని నాకు తెలుసు. ఎంత కష్టమయినా మానాలని నిర్ణయించుకున్న నా నిశ్చయం సడిలిపోనీయకు నీవు మెత్తపడి....నీవలా కఠినంగా వుంటేనే నేనిలా మాటమీద నిలబడగలను .... వద్దు....నాకొద్దునాకు కావల్సింది నీవు....పిల్లలు...." నెమ్మదిగా గొణుక్కుంటూ పాఠం అప్పచెప్పినట్లు అంటున్న రామ్మూర్తి మాటలకి ఈసారి నిజంగా నమ్మకం కుదిరిన సరళ కళ్ళు సంతృప్తిగా మెరిశాయి.

(స్వాతి కథల పోటీ కథ)

★